సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం ◆ 21 ◆ ఏప్రిల్ ◆ 2025



భక్తుల రద్దీ
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం సుమారు 37 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. - 8లో



జన జాగృతం..
వెల్లంకి గ్రామానికి చెందిన హోంగార్డు బండ్ల కృష్ణ పాటలతో సమాజాన్ని చైతన్య పరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. - 9లో



కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు
ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని, కేసీఆర్ పాలన కోరుకుంటున్నారని గొంగిడి సునీత అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

ఐలు జిల్లా కమిటీ ఎన్నిక

భువనగిరిటౌన్ : ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుక్కదువ సోమయ్య, అధ్యక్షుడిగా బొల్లపల్లి కుమార్, ప్రధాన కార్యదర్శి మామిడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తడక మోహన్, పాల్వంచ జగతయ్య, ఎండీ నేహాల్ సహాయ కార్యదర్శులుగా సీసా శ్రీనివాస్, సూదగాని శ్రీహరి, చింతల రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా బొడ్డు కిషన్‌తో పాటు మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా రమేష్, ఎండీ ఖయ్యూం, యాదాసు యాదయ్య, ఆకుల మల్లేశం, పిడుగు ఐలయ్య, గదగాని శంకర్, జిట్టా భాస్కర్‌రెడ్డి, ఎస్‌కే హమీద్, కుక్కదువ సాయి, సునీల్‌కుమార్, చింతల రాజు, వెన్నెల, భీమగాని శ్రీనివాస్, పారునంది రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

భువనగిరి : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఆదివారం ప్రశాతంగా ప్రారంభమయ్యాయి. ఓపెన్ టెన్త్ పరీక్షలకు జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 408 విద్యార్థులకు గాను 362 మంది హాజరు కాగా 46 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్‌కు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,006 మంది విద్యార్థులకు 882 మంది హాజరయ్యారు. 124 మంది గైర్హాజరైనట్లు డీఈఓ తెలిపారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

భువనగిరి : జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ట్రిపుల్ విన్ ప్రాజెక్టు కింద ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ తెలిపారు. గుర్తింపు పొందిన నర్సింగ్ కళాశాలలో జీఎన్‌ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 21 నుంచి 38 ఏళ్లలోపువారు అర్హులన్నారు. జర్మనీ భాషలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈనెల 25లోపు బయోడేటా పంపాలని, వివరాలకు 9440051581, 9440048500ను సంప్రదించాలని కోరారు.

నేడు ప్రజావాణి రద్దు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. భూభారతి పోర్టల్‌పై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండరని, అందుకే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సామాజిక సేవతో గుర్తింపు



ఒప్పంద పత్రం అందజేస్తున్న సర్వయ్య

ఆలేరురూరల్ : సామాజిక సేవతో సంఘంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుందని నేత్ర, అవయవ దాతల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖుర్షిద్ పాషా పేర్కొన్నారు. ఆలేరుకు చెందిన సీనియర్ సిటిజన్ మొరిగాడి సర్వయ్య తన మరణానంతరం భౌతికదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అప్పగిస్తూ ఆదివారం హామీపత్రం అందజేశారు. సమాజహితం కోసం తన కుటుంబసభ్యులను ఒప్పించి, వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం సర్వయ్య తన శరీరాన్ని దానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోహన్‌రావు, మొరిగాడి మహేష్, ముల్లెక్కల రవికుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన

● జిల్లాలో విభిన్న వాతావరణం

భువనగిరిటౌన్ : ద్రోణి ప్రభావంతో జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ, ఆ తరువాత ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. కొన్ని రోజులుగా జిల్లాలో ఇదే వాతావరణం కొనసాగుతోంది.

గుండాలలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత

జిల్లాలో ఆదివారం అత్యధికంగా గుండాలలో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆత్మకూరు(ఎం) 42, అడ్డగూడూరు, రాజాపేటలో 41.6, రామన్నపేట, ఆలేరు, బీబీనగర్‌లో 41 డిగ్రీలు, మిగితా మండలాల్లో 40 డిగ్రీలకు పైగా రికార్డ్ అయ్యింది. ఉదయం ఎండ మండిపోగా సాయంత్రం పలుమండలాల్లో ఒక్కసారిగా ఈదురుగాలులు మొదలై వాతావరణం చల్లబడింది.





మోటకొండూరు మండలం చాడలో రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న ఎస్‌ఐ, గ్రామస్తులు



గుండాల మండలం బ్రాహ్మణపల్లిలో కొట్టుకుపోయిన ధాన్యం

ఉరుములు, ఈదురు గాలులు, వర్షం

మోటకొండూర్ : మండలంలోని చాడ, ముత్తిరెడ్డిగూడెం, కొండాపురం, చందేపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చాడ గ్రామంలో రోడ్డుపై చెట్టు కూలడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ నాగుల ఉపేందర్ గ్రామస్తుల సాయంతో తొలగించారు. ఈదురు గాలులకు వరిచేలు నేలకొరిగాయి.

వలిగొండ : మండలంలోని టేకులసోమారం సమీపంలో వలిగొండ–భువనగిరి రోడ్డుపై చెట్లు విరిగి పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.చెట్లు విద్యుత్ తీగలపై పడిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి, సుద్దాల, బ్రాహ్మణపల్లి, వెల్మజాల, గుండాల గ్రామాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలకు వరి రాశులపై కప్పిన పట్టాలు లేచిపోయాయి.

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మామిడి, సపోట నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. వరి చేలు నేలకొరిగాయి.

"యాదగిరిగుట్ట మండలం మల్లాపురం చెరువులో ఆరు నెలల కిత్రం 60 వేల చేప పిల్లలు వదిలారు. ఇందులో రవ్వ, బొచ్చ, బంగారు తీగ రకాలున్నాయి. గతంలో పోసిన సీడ్‌తో పోలిస్తే వీటిలో ఎదుగుదల తక్కువగా ఉంది. ప్రస్తుతం పావు కిలో బరువే ఉన్నాయని, చేపలు పట్టి, అమ్మడానికి ఇంకా మూడు నెలలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారులు చెబుతున్నారు.

"‘బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలోని ఈదుల చెరువులో 40 వేల చేప పిల్లలు పోశారు. ఆరు నెలలు గడిచినా బరువు 200 గ్రాములు మించి పెరగలేదని, ఈ ఏడాది చేపల పెంపకంతో నష్టపోయామని మత్స్యకారులు వాపోతున్నారు.’

"‘భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం చెరువులో ఏడు నెలల క్రితం రవ్వ, బొచ్చ రకాలకు చెందిన 40వేల చేప పిల్లలు వదిలారు. ఇందులో 20 శాతం పిల్లలు చనిపోయాయి. మిగతా వాటిలో ఎదుగుదల లేదు. ఇప్పటి వరకు అరకిలో బరువు కూడా కాలేదు. ఇదే చెరువులో గతంలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా లక్షకుపైగా బొచ్చె, రౌట, పరక, పాంప్లెట్, కొర్రమీను తదితర రకాలకు చెందిన చేప పిల్లలు పోశారు. ఇవి ఆరు నెలల్లోనే కిలోకు పైగా ఎదిగాయి. ఏడాదిలో 2 కిలోల బరువు మించిపోయాయి.’

బక్కచిక్కిన చేప!



భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు

నాసిరకం చేప పిల్లలతో నష్టాలు

- మత్స్యకారులకు తగ్గిన దిగుబడి
- జిల్లా వ్యాప్తంగా అన్ని చెరువుల్లో ఇదే పరిస్థితి
- ఆరు నెలలైనా పావుకిలోకు మించని బరువు
- కాలందాటిన తరువాత సీడ్ సరఫరా
- ఫైగా తగ్గిన సైజు.. మత్స్యకారులకు నష్టాలు

సాక్షి, యాదాద్రి : మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలు పంపిణీ చేస్తున్నా సత్ఫలితం ఇవ్వడం లేదు. అదునులోపు పంపిణీ చేయకపోవడం, చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడం ఒక కారణమైతే.. నాసిరకం విత్తనంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. జిల్లాలో ఈ సంవత్సరం 140 చెరువుల్లో చేప పిల్లలు వదిలారు. ఆరు నెలలైనా ఆశించిన స్థాయిలో ఎదుగకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నాసిరకం విత్తనం పంపిణీ చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

140 చెరువుల్లోనే చేప పిల్లల పెంపకం

జిల్లాలో 600 చెరువులు చేపల పెంపకానికి అనువైనవి ఉన్నాయి. ఇవన్నీ వర్షాధారిత చెరువులే. ఆయా చెరువుల్లో సుమారు 3 కోట్ల చేప విత్తనం వదలాల్సి ఉంది. కానీ, నిధుల కొరత కారణంగా కేవలం 140 చెరువుల్లో 61 లక్షల చేప పిల్లలు మాత్రమే వదిలారు. ఇందులో 35, 40, 80, 100 మిల్లీ మీటర్ల సైజులో ఉన్న చేప పిల్లలు పోశారు. రవ్వ, బొచ్చె, బంగారు తీగె వంటి రకాలు వదిలారు. చెరువుల్లో చేప పిల్లలు వదిలి ఆరు నెలలు గడిచింది. రకాన్ని బట్టి ఒక్కో చేప కనీసం అర కిలో ఉండాలి. కానీ, చాలా చెరువుల్లో పావు కిలోకు మించి బరువు పెరగలేదు. ముఖ్యంగా మూసీ పరీవాహక చెరువులు, బస్వాపూర్ రిజర్వాయర్, గంధమల్ల, భువనగిరి, బీబీనగర్ చెరువుల్లో చేపల ఎదుగుదల ఆశించిన స్థాయిలో లేదు. అదే ప్రైవేట్‌గా మత్స్యకార్మికులు పోసిన చేప పిల్లలు బరువు పెరిగాయి.

"సొసైటీలకు నేరుగా డబ్బులివ్వాలి



ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే చేప పిల్లల్లో ఎదుగుదల ఉండటం లేదు. వాటికి అయ్యే డబ్బులను నేరుగా మత్స్య సొసైటీలకు అందజేస్తే నాణ్యమైన సీడ్ కొనుగోలు చేసుకుంటాం. రామన్నపేట మత్స్య సంఘం పరిధిలో పెద్ద చెరువు, వెంకట్రామయ్య చెరువులున్నాయి. అక్టోబర్‌లో 50,000 చేప పిల్లలు వదిలారు. కానీ, ఆశించిన స్థాయిలో బరువు పెరగలేదు.

– కందుల హన్మంతు, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు, రామన్నపేట

"చేపల్లో ఎదుగుదల లేదు



దసరా ముందు జలాల్‌పురం చెరువులో 40 వేల చేప పిల్లలు పోశారు. ఆరు నెలలు దాటినా అరకిలో కూడా పెరగలేదు. అదే ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కొనుగోలు చేసి పోసిన చేప పిల్లలు ఆరు నెలల్లో కిలోకు పైగా బరువు పెరిగాయి. ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసే చేప పిల్లల బదులు డబ్బులు ఇస్తే మేమే నాణ్యమైన సీడ్ కొనుగోలు చేసి పెంపకం చేపడుతాం.

– గుండ్ల దర్శన్, మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు, జలాల్‌పురం

ఎన్నేళ్లకెన్నాళ్లకు..!

బొల్లేపల్లి కాల్వ నిర్వాసితుల గుర్తింపునకు కదిలిన యంత్రాంగం

- 2022లో 80 ఎకరాలకు ఫైగా భూ సేకరణ
- రెండు దశాబ్దాలు గడిచినా అందని పరిహారం
- రైతుల వినతులు, పోరాటాలతో కదలిక
- ప్రారంభమైన సర్వే



బొల్లేపల్లి కాల్వ

బీబీనగర్ : సాగునీటి కాల్వ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. 20 ఏళ్లలో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, అధికారులకు వినతులు, ప్రజాప్రతినిధుల నిలదీతలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారుల్లో కదలిక వచ్చింది. కాల్వ కోసం రైతులు ఇచ్చిన భూములను గుర్తించేందుకు సర్వే ప్రారంభించారు.

కాల్వ స్వరూపం ఇదీ..

బీబీనగర్, భువనగిరి మండలాల పరిధిలోని ఎనిమిది గ్రామాలతో పాటు ఐదు గిరిజన తండాలకు బీబీనగర్ మండలం రాఘవాపురం చెరువు నుంచి సాగునీరు అందజేయాలని 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం రాఘవాపురం చెరువు వద్ద నుంచి భువనగిరి మండలం బొల్లేపల్లి వరకు 21 కిలో మీటర్ల మేర కాలువ నిర్మాణం చేయాలని నిర్ణయించింది. అదే సంవత్సరం కాల్వ పనులను ప్రారంభించి 2002లో పూర్తి చేశారు. ఈ కాల్వ ద్వారా రాఘవాపురం, లక్ష్మీదేవిగూడెం, బ్రాహ్మణపల్లి, రామునిగుండ్లతండా, పెద పలుగుతండా, జంపల్లి, బొల్లేపల్లితో పాటు మరో ఆరు గ్రామాల పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

80 ఎకరాల మేర భూ సేకరణ

కాల్వ నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు సేకరించగా నేటికీ వారికి పరిహారం మాత్రం అందలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఇటీవల సర్వే చేపట్టారు. గతంలో సేకరించిన భూమికి హద్దులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కాలువ 16.5 మీటర్ల వెడల్పు ఉంది. కుడివైపు 10 మీటర్లు, ఎడమ వైపు 6.5 మీటర్లు వెడల్పు ఉండేలా హద్దురాళ్లు పెడుతున్నారు. మొత్తం 80 ఎకరాల మేర భూ సేకరణ జరగనుంది.

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో సర్వే

రైతుల పోరాటాలు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల ఆధ్వర్యంలో పది రోజుల క్రితం సర్వే ప్రారంభించారు. గ్రామాల వారీగా ఎంత భూమి పోయింది, రైతులు ఏమేరకు నష్టపోయారో గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు.

త్వరగా పరిహారం అందజేయాలి



బొల్లేపల్లి కాల్వ ద్వారా భూములు కోల్పోయిన రైతులకు రెండు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం అందలేదు, దీని పై గతంలో నేను కోర్టును ఆశ్రయించడం జరిగింది. సర్వే నివేదిక ప్రకారం రైతులందరికీ త్వరగా పరిహారం అందేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– కొమ్మిడి నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బ్రాహ్మణపల్లి, బీబీనగర్ మండలం

కాల్వలో రెండు ఎకరాలు పోయింది



బొలేపల్లి కాల్వలో రెండు ఎకరాల భూమి పోయింది. 25 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు పరిహారం రాలేదు. మొన్నటి నుంచి అధికారులు సర్వే చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలి.

– ముక్కెర వెంకటేష్ యాదవ్, బట్టుగూడం

9 కిలో మీటర్లు సర్వే జరగాల్సి ఉంది

"బొల్లేపల్లి కాల్వ మొత్తం 21కిలో మీటర్ల పొడవు ఉంది. ఇప్పటి వరకు భూ సేకరణకు సంబంధించి 12 కిలో మీటర్ల మేర సర్వే పూర్తి చేశాం. మరో తొమ్మిది కిలో మీటర్లు సర్వే చేయాల్సి ఉంది. సర్వే కొనసాగుతోంది. పూర్తయ్యాక ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఏఈ, బీబీనగర్ మండలం

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



కొలనుపాక చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆలేరురూరల్ : మండలంలోని కొలనుపాక చర్చిలో ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ఏసుక్రీస్తును ఆరాదిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల్లో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు ఏసుక్రీస్తు అని పేర్కొన్నారు. యుగయుగాలకు ఏసయ్య సజీవుడై ఉంటాడన్నారు. క్రీస్తు సమాధిలోనుంచి లేచివచ్చిన శుభవేళ ఈస్టర్ పండుగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరాజు, నీలం పద్మ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన.. తప్పుల సవరణ

'యూడైస్'పై థర్డ్ పార్టీతో సర్వే

- పాఠశాలలకు వెళ్లి పరిశీలిస్తున్న బీఈడీ, డీఈడీ విద్యార్థులు
- నేడు విద్యాశాఖకు నివేదిక అందజేత
- దీని ఆధారంగానే బడులకు బడ్జెట్



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న బీఈడీ, డీఈడీ విద్యార్థులు

భువనగిరి : పాఠశాలలకు సంబంధించి యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు చేసిన సమగ్ర సమాచారాన్ని విద్యాశాఖ తొలిసారిగా థర్డ్ పార్టీతో సర్వే చేయిస్తోంది. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలు పారదర్శకంగా ఉన్నాయా, లేదా.. అని థర్డ్ పార్టీ వ్యక్తులు నేరుగా పాఠశాలలకు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ నివేదిక ఆధారంగానే పాఠశాలలకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించనుంది.

బీఈడీ, డీఈడీ విద్యార్థులతో సర్వే

పాఠశాలల సమగ్ర సమాచారాన్ని ఉపాధ్యాయులు ఏటా యూడైస్‌లో నమోదు చేస్తున్నారు. ఈ సమాచారాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించి ఎంఈఓలకు నివేదిక అందజేస్తారు. ఎంఈఓల పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పాఠశాలలకు నిధుల కేటాయింపు, పథకాల అమలుకు ఈ నివేదిక ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అయితే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలకు, పాఠశాలల్లోని రికార్డులకు సరిపోలక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తప్పులను సవరించేందుకు విద్యాశాఖ బీఈడీ, డీఈడీ విద్యార్థులతో సర్వే చేయిస్తోంది.

ఈ అంశాలపై..

పాఠశాలల్లో నమోదైన విద్యార్థులు, వారంతా అదే స్కూల్‌లో చదువుతున్నారా, ఉపాధ్యాయుల సంఖ్య, తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి, వంటగది, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రంథాయాలు, డిజిటల్ తరగతి గదులు, క్రీడా మైదానం, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందాయా, క్రీడా మైదానం ఉందా, తరగతి గదులెన్ని, ఇంకా ఎన్ని అవసరం తదితర వివరాలను యూడైస్‌లో నమోదు చేశారు. థర్డ్ పార్టీ వ్యక్తులు స్కూళ్లకు వెళ్లి సరిపోల్చి చూస్తున్నారు.

672 పాఠశాలలు ఎంపిక

జిల్లాలో 715 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా సర్వే కోసం 672 పాఠశాలలను ఎంపిక చేశారు. నల్లగొండ డైట్ విద్యార్థులతో పాటు భువనగిరిలోని మదర్ థెరిస్సా, స్టాన్‌ఫోర్డ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, చౌటుప్పల్‌లోని ఏఎంఆర్ బీఈడీ కళాశాలలకు చెందిన 63 మంది విద్యార్థులకు సర్వే బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి 10 పాఠశాలలు కేటాయించారు. రోజూ రెండు పాఠశాలల్లో సర్వే చేస్తున్నారు. వీరికి క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సహకరిస్తున్నారు. యూడైస్‌లో తప్పులు ఉంటే వాటిని సవరించి తుది నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజేయనున్నారు. ఈనెల 15న మొదలైన సర్వే 21వ తేదీ వరకు కొనసాగనుంది.

పారదర్శకత కోసమే సర్వే

"పాఠశాలల్లోని సమగ్ర సమాచారాన్ని ప్రతి విద్యా సంవత్సరం యూడైస్‌లో నమోదు చేస్తాం. వివరాలు సరిగా ఉన్నాయా లేదా సరిపోల్చేందుకు విద్యాశాఖ తొలిసారిగా థర్డ్ పార్టీతో సర్వే చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బీఈడీ, డీఈడీ విద్యార్థులతో సర్వే చేయిస్తున్నాం.

– సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి

ఏఎస్‌ఐలకు పదోన్నతులు, ఎస్‌ఐల బదిలీలు

భువనగిరిటౌన్ : జిల్లాలో ఏడుగురు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతులు లభించాయి. మరో ఐదుగురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వీరికి పదోన్నతులు

బొమ్మలరామారం ఏఎస్‌ఐ దేవేందర్ పదోన్నతిపై యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రానున్నారు. అదే విధంగా భువనగిరి సీసీఎస్ ఏఎస్‌ఐ ఎస్‌కే మదార్ రాచకొండ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్తున్నారు. అంబర్‌పేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఏఎస్‌ఐ జయరాజు భువనగిరి టౌన్‌కు, యాదగిరిగుట్ట టౌన్ బి.నందనాయక్, చౌటుప్పల్ ట్రాఫిక్ ఎండీ గౌస్, చౌటుప్పల్ డి.నర్సిరెడ్డి, ఎస్.కృష్ణ భువనగిరి మహిళా పోలీస్‌స్టేషన్‌కు పదోన్నతిపై రానున్నారు.

బదిలీ అయిన ఎస్‌ఐలు

భువనగిరి పట్టణ ఎస్‌ఐ కె.అరుణ్‌కుమార్ హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు, హయత్‌నగర్ నుంచి వై.లింగారెడ్డి భువనగిరి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. భువనగిరి రూరల్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్‌ను కమిషనరేట్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆయన స్థానంలో మీర్‌పేట్ ఎస్‌ఐ కే.సుధాకర్ రానున్నారు. భువనగిరి ఎస్‌ఓటీ ఎస్ బి.పరమేశ్వర్ సైబర్ క్రైమ్‌కు వెళ్తున్నారు. బదిలీ అయిన ఎస్‌ఐలు ఒకటి రెండు రోజుల్లో విధులనుంచి రిలీవ్ కానున్నారు. వారి స్థానంలో కొత్తవారు బాధ్యతలు స్వీకరించనున్నారు.



గుండాలలోని గోదాము పైకప్పు రేకులు గాలికి లేచిపోయి, శిథిలావస్థకు చేరిన గోడలు

ఏడాదిగా నిర్లక్ష్యం.. గోదామే సాక్ష్యం!

గుండాల : అసలే గోదాముల కొరత.. అందుబాటులో ఉన్నవాటిని సద్వినియోగం చేసుకోలేని దుస్థితి.. గుండాల మండల కేంద్రంలో నిర్మించిన గోదాము అందుకు నిర్లక్ష్యం. ఇది శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 25 సంవత్సరాల క్రితం గుండాల మండల కేంద్రంలో నాలుగు ఎకరాల్లో ప్రభుత్వం సబ్‌మార్కెట్ యార్డు ఏర్పాటు చేసింది. దానికి అనుబంధంగా 400 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం గల రెండు గోదాములు నిర్మించింది. కొన్నేళ్ల వరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి వాటిలో నిల్వ చేసేవారు. కానీ, గత ఏడాది వేసవిలో వీచిన ఈదురుగాలుకు గోదాము పైకప్పు రేకులు లేచిపోయాయి. తిరిగి మరమ్మతులు చేయకపోవడంతో వర్షాలకు గోడలు తడిసి శిథిలావస్థకు చేరుతోంది. మరమ్మతులు చేస్తే ధాన్యం నిల్వకు తిప్పలు తప్పనున్నాయి.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు జమాయిల్ తోట దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అర్వపల్లి: ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని జమాయిల్ తోట దగ్ధమైంది. జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు గుర్రం శ్రీదేవికి మూడున్నర ఎకరాల్లో జమాయిల్ తోట ఉంది. ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని జమాయిల్ తోట కాలిపోతుండగా సూర్యాపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. అక్కడ ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో నకిరేకల్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. అప్పటికే సుమారు ఎకరానికి పైగానే జమాయిల్ చెట్లు కాలిపోయాయి. సుమారు రూ. 5లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం కలిమెర గ్రామానికి చెందిన కట్ట రాజరాముడు(65) శుక్రవారం అక్కెనపల్లి గ్రామానికి చెందిన గుడిసె ఇమ్మయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై అమ్మనబోలు నుంచి వస్తుండగా.. అక్కెనపల్లి గ్రామ శివారులో వీరి బైక్, అదే గ్రామానికి చెందిన చీరబోయిన సత్యనారాయణ బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కట్టా రాజరాముడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగుడు మృతి



వెంకటరమణ (ఫైల్)

కేతేపల్లి: వడదెబ్బకు గురై దివ్యాంగుడు మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .. తుంగతుర్తి గ్రామానికి చెందిన గుంటి వెంకటరమణ(58) దివ్యాంగుడు కావడంతో ఇంటి వద్దనే కారం మిల్లు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తీవ్రమైన ఎండ కారణంగా వెంకటరమణ రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రితో చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆదివారం మరోసారి వెంకటరమణ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

బెల్లం, పటిక స్వాధీనం



నిందితుడిని చూపుతున్నఎక్సైజ్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను శనివారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఆదివారం ఎక్సైజ్ ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ విలేకరులకు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ సమీపంలో శనివారం రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు బైసాని సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై గన్నీ బ్యాగులో బెల్లం తీసుకెళ్తుండగా గుర్తించారు. సత్యనారాయణను అదుపులోకి తీసుకుని విచారించి.. అతడికి చెందిన ఓ గోదాంలో నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల బెల్లం, 14 క్వింటాళ్ల పటికతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్‌కే పర్వీన్, ఎక్సైజ్ సిబ్బంది లతీఫ్, అనిల్‌కుమార్, కరుణాకర్, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్, వాణి, రమణ తదితరులు ఉన్నారు.

జన జాగృతం.. పాటతో మమేకం

- తన పాటలతో సమాజాన్ని చైతన్యపరుస్తున్న హోంగార్డు
- సామాజిక రుగ్మతలపై పాటలు పాడుతూ పలువురి మన్ననలు



అవగాహన సదస్సులో పాట పాడుతున్న కృష్ణ

రామన్నపేట: పెద్దగా చదువుకోనప్పటికీ వ్యవహారిక భాషలో పాటలు రాసి పాడుతూ సమాజాన్ని చైతన్య పరుస్తున్నాడు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన హోంగార్డు బండ్ల కృష్ణ. కృష్ణ వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివాడు. ఆ తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మానేసి పశువుల కాపరిగా మారాడు. పొయ్యిల కట్టెలు కొట్టి అమ్మేవాడు. కొంతకాలం తిరుమలగిరిలో ఓ మెకానిక్ షెడ్‌లో పనిచేశాడు. ఆ సమయంలో గ్రామంలో జరిగే వీధి భాగవతం, నాటకాలు చూస్తూ సొంతంగా పాటలు రాసి పాడటం ప్రారంభించాడు. తాను రాసిన పాటలను నోట్ బుక్‌లో భద్రపరిచేవాడు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణ

జీవితాన్ని మలుపుతిప్పిన పాట

2008 సంవత్సరంలో నల్లగొండలో ఓ ప్రైవేట్ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండ్ల కృష్ణ పాల్గొని ఆ సంస్థకు సంబంధించిన ప్రొడక్ట్‌ను ప్రమోట్ చేస్తూ అద్భుతమైన పాట పాడాడు. ఆ కార్యక్రమాన్ని కవర్ చేసిన నల్లగొండ సిటీ ఛానల్ అధినేత ఏచూరి భాస్కర్ కృష్ణ పాటకు ముగ్ధుడయ్యాడు. దీంతో ఆయన అప్పట్లో ఉమ్మడి నల్లగొండ ఎస్పీగా పనిచేసిన రాజేష్‌కుమార్‌కు కృష్ణను పరిచయం చేశారు. వివిధ అంశాలపై పాటలు పాడిన కృష్ణ ప్రతిభాపాటవాలను గుర్తించిన ఎస్పీ రాజేష్‌కుమార్ ఆయనను హోంగార్డుగా నియమించి పోలీస్ జాగృతి కళాబృందంలో సభ్యుడిగా చేర్చాడు. అప్పటి నుంచి కృష్ణ సమాజాన్ని చైతన్య పరిచే అనేక ప్రదర్శనలు ఇచ్చి ప్రజలు, అధికారుల మన్ననలు పొందుతూ వస్తున్నాడు.

అనేక అంశాలపై ప్రదర్శన

గడిచిన పదిహేనేళ్లుగా కృష్ణ పల్లెపల్లెన తిరుగుతూ బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, ప్రేమ వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు, మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నాడు. సీసీ కెమెరాల ఉపయోగం, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాడు. వివిధ సామాజిక అంశాలు, చేతివృత్తుల ఇతివృత్తంగా కృష్ణ రాసిన పాటలు కృష్ణ గీతాల పేరిట పుస్తక రూపంలో ముద్రించబడ్డాయి. ఆ పుస్తకాన్ని ప్రముఖ సినీ దర్శకుడు శంకర్ ఆవిష్కరించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన షీ టీంల పనితీరును తెలుపుతూ రాసిన 'షీ టీంలు కదిలే' పుస్తకం సైతం ప్రచురితమైంది.



కరోనాపై అవగాహన కల్పిస్తున్న కృష్ణ (ఫైల్)

పాటే నాకు జీవనాధారమైంది



మాది నిరుపేద కుటుంబం. చిన్నప్పుడు అనుభవించిన కష్టాల నుంచే పాటలు పుట్టుకువచ్చాయి. ఆ పాటే నాకు ప్రాణం. జీవనాధారం. వివిధ సామాజిక రుగ్మతల మీద ప్రజలను అప్రమత్తం చేసే అదృష్టం, బాధ్యతను పోలీస్‌శాఖ నాకు కల్పించింది. నూటికి నూరుశాతం నా బాధ్యతను నెరవేరుస్తాను. నా పాటను ఆదరిస్తున్న ప్రజలకు, నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న పోలీస్‌శాఖ పెద్దలకు రుణపడి ఉంటాను.

– బండ్ల కృష్ణ, కవి, గాయకుడు

కరోనా కట్టడికి తన వంతుగా...

పోలీసు జాగృతి కళాబృందంలో చేరిన బండ్ల కృష్ణ ప్రస్తుతం యాదాద్రి భువనగిరి టీం ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. కరోనా సమయంలో కృష్ణ సంకన సౌండ్ బాక్స్ పెట్టుకొని తన లూనాపై జిల్లా వ్యాప్తంగా తిరిగి ప్రదర్శనలు ఇచ్చాడు. కరోనా కట్టడి కోసం తన పాట ద్వారా విశ్వ ప్రయత్నం చేశాడు. కరోనా వేషధారణలో వ్యాధి వ్యాప్తి చెందే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాస్కులు ధరించాలని, భౌతికదూరం పాటించాలని, లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని పాటలు పాడుతూ జనాన్ని చైతన్యపరిచాడు. కృష్ణ కృషిని గుర్తించిన అధికారులు 2019, 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఉత్తమ హోంగార్డుగా ఎంపిక చేసి సత్కరించారు. అప్పట్లో రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ కృష్ణ ప్రతిభను మెచ్చి నగదు పురస్కారం అందజేశారు.

యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయ ముఖ మండపం క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. స్వామివారి ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, శివాలయం వెళ్లే మార్గం, కొండ కింద, కొండ పైన బస్టాండ్, లక్ష్మీ పుష్కరిణి, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కల్యాణ కట్ట ప్రాంతాల్లో భక్తులు కిటకిటలాడారు. స్వామివారిని 37వేల మందికి పైగా భక్తుల దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారని, వివిధ పూజలతో నిత్యాదాయం రూ.47,65,035 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

యాదగిరి క్షేత్రంలో విశేష పూజలు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఉదయాన్నే అర్చకులు సుప్రభాతం, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన చేపట్టారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని అర్చకులు జరిపించారు. అనంతరం గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ద్వార బంధనం చేశారు.



రూ.150 టికెట్ క్యూలైన్‌లో భక్తులు

ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా భక్తురాలికి గాయాలు

కొండపైన ఓ భక్తురాలు ఆర్టీసీ బస్సు ఎక్కుతూ కిందపడి గాయపడింది. హైదరాబాద్‌కు చెందిన బీటెక్ చదువుతున్న రమ్యశ్రీ ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చింది. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో కొండ పైన బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా.. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో రమ్యశ్రీ ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఆలయ అధికారులు, సిబ్బంది గమనించి పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం భువనగిరి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు.



గాయపడిన రమ్యశ్రీకి చికిత్స చేస్తున్న కొండ పైన ఆస్పత్రి సిబ్బంది

విద్యుదాఘాతంతో వలస కార్మికుడు మృతి

మాడ్గులపల్లి: ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలస కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియబండ్ జిల్లా ముంగర్ గ్రామానికి చెందిన హేమసాగర్ పాటిల్(21) మాడ్గులపల్లి మండలం గండ్రవానిగూడెం గ్రామ శివారులో అనిల్‌రెడ్డికి చెందిన ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి హేమసాగర్ పాటిల్ ఇటుక బట్టీ వద్ద తన రూంలో సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు, ఇటుక బట్టీ యజమాని గమనించి అతడిని మిర్యాలగూడలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరి సునీతపాటిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ మోటారు స్టార్టర్ వైరు తగిలి..

మిర్యాలగూడ టౌన్: విద్యుత్ మోటారు స్టార్టర్ వైరు తగిలి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామ శివారులో జరిగింది. రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చిల్లాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి లక్ష్మీనారాయణ(45) ఎలక్ట్రికల్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం అతడు గ్రామస్తులతో కలిసి గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో జానపాటి సైదులుకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ మోటారు స్టార్టర్ వైరు లక్ష్మీనారాయణకు తగలడంతో విద్యుదాఘాతానికి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బొడ్డుపల్లి మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



లక్ష్మీనారాయణ (ఫైల్)

గంగమ్మ తల్లి ఆలయంలో చోరీ

- అమ్మవారి బంగారు కళ్లు, హుండీలోని రూ.3వేల నగదు అపహరణ

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం శివారులోని గంగమ్మ తల్లి ఆలయంలోకి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి అమ్మవారి బంగారు కళ్లను అపహరించారు. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి ఆలయం తలుపులను పగులగొట్టి లోపలికి వెళ్లి గర్భగుడిలో అమ్మవారికి చెందిన రెండు గ్రాముల బంగారు కళ్లతో పాటు హుండీని పగులకొట్టి రూ.3వేల నగదు ఎత్తుకెళ్లాడు. ఆదివారం ఉదయం ఆలయం వద్దకు రాగానే గర్భగుడి తలుపులు పగులగొట్టి ఉండటం గమనించిన ఆలయ కమిటీ చైర్మన్ భీమవరపు కోటిరెడ్డి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదే ఆలయంలో 20రోజుల క్రితం అమ్మవారి ఆభరణాలు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు.



చోరీ జరిగిన ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో 8 మంది నిందితులు

హుజూర్‌నగర్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న 8మంది ముఠా సభ్యులను ఆదివారం హుజూర్‌నగర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం .. హుజూర్‌నగర్, మేళ్లచెరువు, విజయవాడ, రాయినిగూడెం గ్రామాలకు చెందిన షేక్ ఖలీముద్దీన్, పొట్టి కోటయ్య, షేక్ అయూబ్ పాషా, పొట్టేపంగు కాటయ్య, తోడేటి గోపికృష్ణ, తిరుమలశెట్టి రామమోహన్‌రావు, సామల నర్సింహారెడ్డి, వాడపల్లి నర్సింహారావు కొంతకాలంగా ఆన్‌లైన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ నడిపిస్తున్నారు. వీరు ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని నల్లగొండ పాన్ షాప్ వద్దకు వచ్చి బెట్టింగ్‌కు పాల్పడుతుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.3,400 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

సూర్యాపేటటౌన్: కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న 27 పశువులను సూర్యాపేట రూరల్ పోలీసులు పట్టుకున్నట్లు రూరల్ సీఐ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై టేకుమట్ల వద్ద శనివారం సూర్యాపేట రూరల్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా.. జనగామ జిల్లా నుంచి తమిళనాడుకు కంటెయినర్‌లో అక్రమంగా తరలిస్తున్న 18 ఎద్దులు, 9 దున్నపోతులను పట్టుకున్నారు. పట్టుబడిన పశువులను వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేటలోని గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

స్వర్ణగిరీశుడికి వైభవంగా నిత్య కల్యాణం

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం స్వామి వారికి నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నప్రసాదం వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బావిలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

సూర్యాపేటటౌన్: సూర్యాపేట మండలం కేసారం గ్రామంలో శనివారం ఈతకు వెళ్లి బావిలో గల్లంతైన మహేందర్(11) మృతదేహం ఆదివారం లభ్యమైంది. బావిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు, పోలీసులు రెండు చైనా మోటార్లు, రెండు ట్రాక్టర్ మోటార్లతో నీటిని అర్ధరాత్రి వరకు బయటకు తీసి.. బాలుడి మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. మృతదేహానికి సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మోత్కూరు: మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో బస్ స్టేజీ సమీపంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతడి వద్ద దొరికిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడు రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావు మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తీపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి(52)గా గుర్తించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు వినయ్, కుమార్తె వెన్నెల ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతుడు శనివారం రాత్రి నార్కట్‌పల్లి నుంచి మోత్కూరుకు వచ్చే ఆర్టీసీ బస్సులో వచ్చి పొడిచేడు వద్ద దిగి రాత్రి బస్ స్టేజీ వద్దనే గడిపినట్లు గ్రామస్తులు తెలిపారు. తనను కుటుంబ సభ్యులు పట్టించుకోకుండా వదిలేశారని, తాను హైదరాబాద్‌లోని తార్నాక ప్రాంతానికి చెందిన వాడినని స్థానికులతో మృతుడు పేర్కొన్నట్లు తెలిసింది.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. యువకుడి మృతి

మోత్కూరు: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం నిదానపురం గ్రామానికి చెందిన కాక గణేష్(23), సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన పులిబచ్చల సంపత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మోత్కూరు మండలం అనాజిపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గణేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న సంపత్‌కు మాత్రం స్వల్ప గాయాలయ్యాయి. సంపత్ తలకు హెల్మెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని గణేష్ మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోత్కూరు ఎస్‌ఐ డి. నాగరాజు తెలిపారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య

అడవిదేవులపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం అడవిదేవులపల్లి మండలం కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం .. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి చెందిన మొగిలి రాంబాబు(45) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం అతడి భార్య వెంకటలక్ష్మి మృతిచెందడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రాంబాబు (ఫైల్)

స్కాన్ చేయట్లే.. అభిప్రాయం చెప్పట్లే..

- ఖాకీల పనితీరు తెలుసుకునేందుకు పోలీస్ స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు
- అవగాహన లేక పట్టించుకోని ఫిర్యాదుదారులు



పోలీస్ స్టేషన్‌లో అంటించిన క్యూఆర్ కోడ్

మిర్యాలగూడ అర్బన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడి నుంచి పోలీసుల పనితీరును తెలుసుకునేందుకు పోలీస్ శాఖ గతంలో థర్డ్ పార్టీ వారితో ఎంక్వయిరీ చేయించేవారు. అయితే ప్రజల నుంచి నేరుగా పోలీసుల పనితీరు, వారి వ్యవహార శైలి, కేసులు నమోదుపై వారు అందిస్తున్న సేవలను ఫిర్యాదుదారులు నేరుగా తమ అభిప్రాయలను తెలియజేసేందుకు వీలుగా ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్యూఆర్ కోడ్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. నూతనంగా తీసుకొచ్చిన ఈ విధానం ద్వారా ఫిర్యాదుదారుడి నుంచి కేసు వివరాలతో పాటు పోలీసుల పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

అవగాహన కల్పించని పోలీసులు..

పోలీస్ స్టేషన్లకు వచ్చే వారికి క్యూఆర్ కోడ్ పట్ల అవగాహన కల్పించకపోవడం వలన ఇది నిరుపయోగంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తే తమ పైనే ఫిర్యాదులు చేస్తారేమోననే భావన పోలీస్ వర్గాల్లో ఉందని, అందుకే క్యూఆర్ కోడ్ విషయాన్ని ప్రజలకు చెప్పడంలేదని పలువురు చమత్కరిస్తున్నారు.

ఇలా స్కాన్ చేయాలి..

పోలీస్ స్టేషన్లలో అంటించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఫారం నింపాలి. ఆ తర్వాత భాషను ఎంచుకుని, పేరు, లింగము, సెల్ నంబర్, మెయిల్ ఐడీ నమోదు చేసి.. పిటీషన్, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, పాస్‌పోర్టు ధ్రువీకరణ, ఇతర సేవల్లోని ఏదో ఒక అంశాన్ని ఎంచుకోవాలి. అనంతరం అందులో యూనిట్ పోలీస్ స్టేషన్‌ను ఎంపిక చేసుకోవాలి.

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో డివిజన్ల వారీగా సర్కిళ్లు, పోలీస్ స్టేషన్ల సంఖ్య

డివిజన్	సర్కిళ్లు	పోలీస్ స్టేషన్లు
నల్లగొండ	4	16
మిర్యాలగూడ	3	14
దేవరకొండ	3	10
సూర్యాపేట	3	13
కోదాడ	3	13
రాచకొండ కమిషనరేట్ పరిధిలో..		
భువనగిరి	1	6
యాదాద్రి	1	6
చౌటుప్పల్	2	7

జవాబుదారీతనం పెరుగుతుంది



ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా అందించే సేవలపై ప్రజలు, ఫిర్యాదుదారులకు అవగాహన కలిగి ఉండాలి. పోలీస్ స్టేషన్లకు వచ్చే పౌరులకు పారదర్శకంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా పోలీస్ సిబ్బందిలో సైతం జవాబుదారీతనం పెరుగుతుంది. ఈ క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషిచేస్తున్నాం. ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుదారులకు క్యూఆర్ కోడ్ గురించి వివరించాలని సిబ్బందికి సూచిస్తాం.

– రాజశేఖర రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

అభిప్రాయం సేకరించే అంశాలు ఇవీ..

- పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసును నమోదు చేశారా? లేదా?
- ఫిర్యాదులోని అంశాల ప్రకారమే కేసు నమోదు చేశారా? లేదా?
- ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారా? లేదా?
- పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది ప్రవర్తన, వ్యవహార శైలి ఎలా ఉంది?
- ట్రాఫిక్ చలాన్ల విషయంలో పోలీసుల పనితీరు?
- పాస్‌పోర్టు ధ్రువీకరణ అంశంపై పోలీసు పనితీరు ఎలా ఉంది?
- ఇతర సేవల గురించి అభిప్రాయాలు?